క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.6.17లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఎస్‌ఐ శంకరయ్య హాజరై హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఎనిమిది నెలల నుంచి భక్తులు సమర్పించిన కానుకలు రూ.6,17,878 వచ్చినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అవస్థలు



వీల్ చైర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ కార్యాలయంలోకి వెళ్తున్న దివ్యాంగులు

సంగారెడ్డి జోన్: తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం జిన్నారం మండలంలోని పలువురు కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చారు. అయితే ర్యాంపునకు అడ్డుగా వాహనాలు నిలపడంతో వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే వీల్ చైర్ అందుబాటులో లేకపోవటంతో కార్యాలయం లోపలికి ఇబ్బందులు పడుతూ వెళ్లారు.

నూతన కార్యవర్గం



నియామక పత్రం అందజేస్తున్న సభ్యులు

పటాన్‌చెరు టౌన్: మండలం మేరు సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాచర్ల శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అనీల్ కుమార్, కోశాధికారిగా రాచర్ల అశోక్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, మేరు కుల సభ్యులు హాజరయ్యారు.

అంబలి పంపిణీ

నారాయణఖేడ్: జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మనూరు మండల కేంద్రంలో అంబలి కేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా పాదచారులు, ప్రయాణికులు, స్థానికులు ఉపశమనం పొందేందుకు అంబలి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు పరశురాంరెడ్డి, శ్రీనివాస్, తుకారాం, అబి పవార్, అనిల్ కుమార్, దత్తు, అశోక్‌రెడ్డి, వీరారెడ్డి, మల్గొండ, యాదుల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విద్యార్థులు వేసిన బొమ్మలతో ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు వేసిన అందమైన బొమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామని హెచ్‌ఎం స్వామిదాస్ తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

నారాయణఖేడ్: రిపోర్టర్లు కార్యాలయంలోకి రావద్దంటూ పోస్టర్ అతికించిన కంగ్టి తహసీల్దార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖేడ్‌లో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో పిల్లర్‌గా ఉన్న జర్నలిస్టులపై ఇలాంటి పోస్టర్లు అతికించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ పరిష్కారం అయ్యేలా కృషి చేసే జర్నలిస్టులను ఇలా అవమానించడం పద్ధతి కాదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- సపోర్టు తీగలకు కరెంట్ సరఫరా
- మృతి చెందుతున్న మూగజీవులు
- కంచె లేకపోవడంతోనే ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



విద్యుదాఘాతంతో మల్‌చెల్మలో మృతి చెందిన గేదె(ఫైల్)



మొగుడంపల్లిలో కంచె లేకుండా ఉన్న సింగల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

జహీరాబాద్ టౌన్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సపోర్టు వైర్లు మూగజీవులను కబళిస్తున్నాయి. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, రహదారుల వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జహీరాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సౌకర్యం కోసం పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు బిగించారు. తరువాత వాటికి రక్షణగా కంచె ఏర్పాటు చేయడం మరిచారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న తీగలు, విరిగిన స్తంభాల గురించి ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించని సందర్భాలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణగా కంచెలు ఏర్పాటు చేయకపోవడం, జనసంచారం ఉండే ప్రాంతాల్లో సపోర్టు తీగలకు విద్యుత్ సరఫరా జరగడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొన్ని ఘటనలు

- మండల కేంద్రమైన మొగుడంపల్లిలో ఈ నెల 24న వడ్డే లక్ష్మయ్యకు చెందిన మేకలను మేతకు తీసుకెళ్లిన క్రమంలో పొలం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు ఓ మేక తాకింది. దీంతో విద్యుతాఘాతంతో అక్కడిక్కడే చనిపోయింది.
- జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మలో ఫిబ్రవరి 19న రైతు గౌస్‌కు చెందిన గేదె మేతకు వెళ్లి సాయంత్రం ఇంటి వస్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు తాకి కరెంట్ షాక్‌తో మృతి చెందింది.
- జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ వెళ్లే దారిలో గల కాలనీలో ఇటీవల విద్యుదాఘాతం తగిలి గేదె మృతి చెందింది.
- పట్టణంలోని మేరీమాత ఆలయం నుంచి సాయిరాం నగర్ కాలనీకి వెళ్లేదారిలో ఇటీవల కరెంట్ షాక్ తగిలి ఆవులు మృత్యువాత పడ్డాయి.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు: కార్మికులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల సువెన్ ఫార్మా పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ ఏర్పాటైన సందర్భంగా ఆయన హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సువెన్ ఫార్మా కార్మిక సంఘం అధ్యక్షుడు రాజయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు పాండురంగా రెడ్డి, జనరల్ సెక్రెటరీ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ నాయకులు వెంకటేశ్, చంద్రయ్య, శ్రీనివాసు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీగా ప్రైవేట్ పాఠశాలలు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సురేశ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు స్టేషనరీలుగా తయారయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వచ్చే అకడమిక్‌కు సంబంధించి ఇప్పటి నుంచే నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, నాయకులు ఏలియా, అనిల్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును విరమించుకోవాలి



దీక్షలో పాల్గొన్న మహిళలు, వృద్ధులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 52వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నల్లవల్లి గ్రామంలోని రిలే నిరాహార దీక్షలో స్థానిక మహిళలు, వృద్ధులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు విరమించే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు స్థానిక మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి పేదలకు వరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. పెద్ద శంకరంపేట మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన భూదెమ్మకు సీఎం సహాయనిధి నుంచి రూ.46 వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం ఖేడ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ లబ్ధిదారురాలికి అందజేశారు. కోటగిరి గ్రామానికి చెందిన అనురాధకు అత్యవసర ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.3 లక్షల మంజూరుకు సంబంధించిన ఎల్వోసీ జారీ అయ్యింది. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సూచన మేరకు ఆయన సతీమణి ఉమాదేవి షెట్కార్ ఎల్వోసీని లబ్ధిదారురాలికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భానుగౌడ్, నారాయణరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: బ్రహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల కార్యాలయంలో శుక్రవారం విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాంగం సూర్య చంద్రుల సంచరణతో అనుసంధానమై ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణారావు,రాఘవేంద్రరావు, వసంత్‌రావు, మురళి అయ్యర్, శ్రీనివాస్ శాస్త్రి, సరస్వతి కుల్‌కర్ణి, నర్మదా దేశ్‌పాండే, అఖిల జోషి, భవాని, మంజుల పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై సర్వే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలోని నారాయణ రావు వెంచర్ ఏ బ్లాక్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు సర్వే నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ఏ బ్లాక్‌లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు జిల్లా అధికారులు సర్వే చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని రుద్రారం జాతీయ రహదారి పక్కన ప్యాలెస్ హోటల్ సమీపంలో ప్యాసింజర్ ఆటోలో మద్యం మత్తులో అపస్మారక స్థితిలో శుక్రవారం ఉదయం 5 గంటలకు ఓ వ్యక్తి కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఉదయం 7 గంటలకు అతడు మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం... గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా నలుగురికి రూ. 2 వేల చొప్పున జరిమానా, ఇద్దరికీ రూ.1500, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పిట్టలకేరీలో ఇఫ్తార్ విందు

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు



వడ్డిస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): రంజాన్ పండుగను పురస్కరించుకొని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పిట్టలకేరీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలోని ముస్లిం సోదరులు భారీగా హాజరై ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి ముస్లింలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు సత్యనారాయణ, రామాగౌడ్, కాంగ్రెస్ నాయకులు, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

ఝరాసంగంలో..

ఝరాసంగం(జహీరాబాద్): రంజాన్‌ను పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున మండల కేంద్రంలోని షాదీఖాన ఆవరణలో ముస్లింలకు శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, మాజీ ఎంపీపీ హన్మంతరావు పాటిల్, నాయకులు ముల్తాని, అశ్రఫ్‌అలీ, షౌకత్‌అలీ, అన్సార్, శంకర్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

డ్వామా ఏపీడీ బాల్‌రాజ్



అత్నూర్‌లో గేదెల షెడ్‌ను పరిశీలిస్తున్న బాల్‌రాజ్

న్యాల్‌కల్(జహీరాబాద్): పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని డ్వామా ఏపీడీ బాల్‌రాజ్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని అత్నూర్‌లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గేదెల షెడ్, న్యాల్‌కల్‌లోని మామిడి తోటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సాగు చేసేలా చూడాలన్నారు. జాబ్ కార్డులు కలిగిన కూలీలందరికి పనులు కల్పించాలని సూచించారు. మొక్కల పెంపకం కోసం శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఏపీఓ రంగారావు ఉన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ బోనాలు



అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మహిళలు

రాయికోడ్(అందోల్): మండలంలోని ఇందూర్ గ్రామంలో నల్లపోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీసుకొచ్చిన నైవేద్యాలు అమ్మవారికి పెట్టి ఒడి బియ్యం పోశారు. డప్పుచప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి మహిళలు అమ్మవారికి బోనాలను తీసుకెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



స్టిక్కర్ అంటిస్తున్న మున్సిపల్ కార్మికుడు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పలు వ్యాపార సంస్థల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ పురపాలక సిబ్బంది స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్ ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు, కప్పులు, గ్లాసులు వ్యాపార సంస్థల్లో, హోటళ్లో వాడొద్దని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్రయవిక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు జరిపితే రూ.5వేలు, వినియోగించిన యెడల రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వ్యాపార సంస్థల యజమానులు, స్థానికులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులందుకున్న లబ్ధిదారులు

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి అన్నారు. మండలంలోని 66 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన రూ. 66.7 లక్షల విలువైన చెక్కులను వారికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంబిరెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రావుపాటిల్,ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, మాజీ సర్పంచ్‌లు సంగారెడ్డి, జానయ్య, అశోక్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్, సుధాకర్, సురేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి 2.45 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పటాన్‌చెరు ఏఈ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత మార్కెట్, గౌతమ్ నగర్, జాతీయ రహదారి లక్కడొడ్డి, గోకుల్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.45 నిమిషాల వరకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, ఎంజీ రోడ్డు, ముదిరాజ్ బస్తీ, అంబేద్కర్ కాలనీ, భగత్ గల్లీ, రామ్‌మందిర్ రోడ్డు, వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, ఇండస్ట్రీస్ ఏరియాలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

◆ విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అవసరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బాల్యం నుంచే విద్యార్థులకు జీవన నైపుణ్యాలను నేర్పించాలని రిటైర్డ్ ఎంఈవో, న్యాయవాది అంజయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు, గణితంను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్) అలవాటు చేసి, వారు ఆచరించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమయం దొరికినప్పుడల్లా విద్యార్థులతో కొంత సమయం కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీనాయక్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, సుజాత, ప్రసన్న, సీఆర్పీ రాజేశ్ పాల్గొన్నారు.

◆ బకాయిలు చెల్లించాలని సీఎంకు లేఖ



లేఖ చూపుతున్న అరుణ్ శేరికార్

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో 2019 నుంచి 2024 వరకు పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ సర్పంచ్‌ల బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుణ్ శేరికార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారని, బిల్లులు అందక వారి కుటుంబాలు దీన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అందాల పోటీలకు బడ్జెట్ కేటాయించిన ముఖ్యమంత్రి పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెడితే ప్రజలు సంతోషించేవారని వివరించారు. లేఖను ఖేడ్ తపాలా కార్యాలయంలో పోస్ట్ చేశారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న ఎండీ గౌతమ్ తదితరులు

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ శుక్రవారం పరిశీలించారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణాలు పూర్తి చేయాలని, ఈ మేరకు ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణా రెడ్డి ఎంపీఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.